ప్రజాశక్తి
మంగళవారం 16 మే 2023
5
శ్రీ సత్యసాయి

వడదెబ్బతో ఉపాధికూలీ మృతి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని గొడ్డి వెలగల పంచాయతీలోని జీడి మేకలపల్లికి చెందిన ఉపాధి కూలీ వడదెబ్బతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన అన్వర్‌బాషా (65) రోజువారీగా ఉపాధి పనికి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉపాధి పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయాడు. ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు వెంటనే అప్రమత్తమయ్యారు. చెట్టుకిందకి తరలించేలోగా మృతిచెందాడు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ విషయాన్ని ఎంపీడీవో. డి అంజనప్ప. ఏపీవో మంజునాథ్‌కు తెలిపారు. దీంతో వారు సంఘటన స్థలాన్ని సందర్శించారు. నివేదికను జిల్లా అధికారులకు పంపామని అన్నారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ సందర్భంగా సర్పంచి ఆంజనేయులు మాట్లాడుతూ కూలి పని చేసుకుని కుటుంబాన్ని పోషించే అన్వర్‌బాషా మృతితో వారి కుటుంబం వీధిన పడిందని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉక్కిరి.. బిక్కిరి...

మొన్నటి వరకు వానలు, ఇప్పుడు ఎండలు
మరో రెండు రోజులు వడగాల్పులు

చీరకొంగు కప్పుకుని ద్విచక్రవాహనంలో వెళుతున్న మహిళలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మొన్నటి వరకు వానలు, ఇప్పుడు ఎండలు కలిపి ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఒక రోజు మేఘావృతమై ఉండటం, మరో రోజు ఎండలు, వడగాల్పులు ఉండటంతో జనం అల్లాడిపోతున్నారు. సోమవారం అనంతపురం జిల్లాలో అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శింగనమల మండలం తరిమెల గ్రామంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదయింది. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు ఉండే అవకావముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సగటున ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీలు పెరుగుతుందని సూచించింది. సోమవారం నాటికే గరిష్ట ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరిన నేపథ్యంలో మరింత పెరిగితే 45కు పైగా చేరే అవకాశముంది.

ఈ ఏడాదిలో గరిష్టం 43.1 డిగ్రీలు

ఈ ఏడాది గరిష్టంగా 43.1 డిగ్రీలు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ 20వ తేదీన ఈ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ తరువాత 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడం సోమవారమే కావడం గమనార్హం. కళ్యాణదుర్గంలో 41.15 డిగ్రీలు, తాడిపత్రిలో 40.79, ఆత్మకూరు మండలంలో 40.78 డిగ్రీలు నమెదయ్యాయి. యల్లనూరు 40.52 డిగ్రీలు నమోదయ్యాయి.

2016లో గరిష్టం

ఏడు సంవత్సరాల్లో అత్యధికంగా ఏప్రిల్ నెలలోనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ 2016 గరిష్టంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఆ తరువాత 2017 ఏప్రిల్ నెలలో 43.7 డిగ్రీలు నమోదయ్యాయి. 2022 ఏప్రిల్‌లో 43.5 డిగ్రీలు నమోదయింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏప్రిల్ నెలలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ నెలాఖరు నుంచి జిల్లాలో వర్షాలు పడటంతో ఇక వాతావరణం చల్లబడిందని అందరూ భావించారు. కాని తిరిగి రెండు, మూడు రోజులుగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఎండలు మండుతున్నాయి. మరోవైపు వడగాల్పులు సైతం పెరుగుతున్నాయి.

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి

ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం సమయంలో జనం బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. సోమవారం ఉమ్మడి జిల్లాలో ఇద్దరు వడదెబ్బతో మృతిచెందారు. సాయంత్రం వరకు జనం బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. మధ్యాహ్న సమయాల్లో ఎసిలు, కూలర్లను జనం ఆశ్రయించాల్సి వస్తోంది. వడగాల్పులు ఎక్కువ అయ్యే అవకాశమున్న నేపథ్యంలో జనం తగిన జాగ్రత్తలు పాటించాలని వాతావరణ శాఖ సూచిస్తోంది.

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్ హెచ్చరించారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు బైఠాయించి కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులకు పలుచోట్ల 3 నుంచి 9 నెలల వరకు వేతనాలు ఇవ్వకుండా పెండింగ్ లో పెట్టారన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు నిబంధనల ప్రకారం రూ. 6 వేలు ఇవ్వాల్సి ఉండగా వారికి చాలా పంచాయతీలలో అంత మొత్తం ఇవ్వడం లేదన్నారు. కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. అలాగే గ్రామాల్లో దళితులకు శ్మశాన వాటిక కోసం రెండు ఎకరాలు భూమి కేటాయించాలని అందులో మౌలిక సదుపాయాలు కల్పించాలని జీవో ఉందని చెప్పారు. జిల్లా పంచాయతీ వర్కర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ పలు పంచాయతీ కార్యదర్శులు పోస్టుల రెన్యువల్ చేయడం లేదన్నారు. పంచాయతీల ఆదాయం బట్టి కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. అనంతరం కలెక్టర్ అరుణ్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ స్పందన రోజు కాకుండా బుధ లేదా గురువారం వస్తే పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సజ్జరామప్ప, నాయకులు ఆది, రమేష్, మహబూబ్ బాషా, అంజినప్ప, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో మాట్లాడుతున్న ఇంతియాజ్

కొండాపురం రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

కడప జిల్లా కొండాపురం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించిందని కలెక్టర్ ఎం గౌతమి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందన్నారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు చెల్లించనున్నామని తెలిపారు. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డవారు సవీరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

సంక్షేమ పథకాల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ రూపొందించిన జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023-24 ను కలెక్టరేట్‌లో కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్‌ఒ కొండయ్య, ఆర్‌డిఒ భాగ్యరేఖ, డిఇఒ మీనాక్షి, డిపిఆర్‌ఒ వేలాయుధం తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ క్యాలెండర్లలో వివరించడం చాలా బాగుందన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల సూచనల మేరకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ నెలలో ఏయే పథకాలు అమలు చేయాలో వాటి వివరాలు ఇందులో పొందుపరచాలన్నారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి : స్పందన గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ లో ప్రజల నుంచి కలెక్టర్ 171 అర్జీలను స్వీకరించారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోందన్నారు. ఇందులో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ప్రజలు తమ సమస్యలు, సూచనలను 1902 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయవచ్చని అన్నారు. రీ ఓపెన్ పిటిషన్లు 51 ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని చెప్పారు. ప్రతి అధికారి అర్జీదారుతో వ్యక్తిగతంగా మాట్లాడి పరిష్కరించి తిరిగి పిటిషన్ రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రైతు భరోసా కేంద్రాలలో పోస్టర్లు ప్రదర్శించాలి

జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో పట్టు పరిశ్రమ శాఖ చేపడుతున్న పనులు, పథకాలకు సంబంధించి అన్ని రకాల పోస్టర్లను ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టు పరిశ్రమ పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అధిక దిగుబడి, అధిక ఆదాయం పొందేందుకు మల్బరీ తోటలో పాటించవలసిన సూచనలు, ఇతర పథకాలు వివరించే ఐదు రకాల పోస్టర్లను ప్రదర్శించడం ద్వారా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెసి చేతన్, డిఆర్‌ఒకొండయ్య, పట్టు పరిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, ఆర్‌డిఒ భాగ్యరేఖ, సిపిఒ విజయ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఎడి శుభదాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

ఏడుగురు దుర్మరణం, మృతులు అనంత జిల్లా వాసులు
ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృత్యువాత

కడప జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

ఎంతో సంతోషంగా దైవ దర్శనానికి వెళ్లిన ఓ కుటుంబం మరో అరగంటలో ఇంటికి చేరుకుంటామనుకున్న సమయంలో ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. తుఫాను వాహనాన్ని లారీ ఢీకొన్న ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందారు. వీరిలో ఆరుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు. మృతుల కుటుంబసభ్యులు ఆసుపత్రి ఆవరణంలో చేస్తున్న రోదనలు కంటతడిపెట్టించాయి.

ప్రజాశక్తి తాడిపత్రి

కడప జిల్లా రైల్వే కొండాపురం సమీపంలోని తాడిపత్రి కడప జాతీయ రహదారిలో తాడిపత్రి శివార్లలోని చిత్రావతి నది సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతిచెందారు. అందులో ఒకే కుటుంబానికి చెందినవారు ఆరుగురు కాగా, మరొకరు వాహనం డ్రైవర్. ఈ ప్రమాదానికి సంబందించిన వివరాలు... తాడిపత్రి పట్టణంలోని కృష్ణాపురంలో నివాసముంటున్న వెంకటలక్ష్మి తన ముగ్గురు చెల్లెళ్ల కుటుంబంతో కలిసి తిరుమలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం తాడిపత్రిలో తుఫాను వాహనాన్ని బాడుగ తీసుకుని డ్రైవర్‌తో కలసి మొత్తం 14 మంది తిరుమలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సోమవారం తెల్లవారుజామున తాడిపత్రి శివార్లలోని కడప జిల్లా రైల్వే కొండాపురం సమీపంలోని తాడిపత్రి కడప జాతీయ రహదారిలో చిత్రావతి నది సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో తాడిపత్రికి చెందిన వెంకటలక్ష్మి (55), ఆమె కుమారుడు సునిల్‌కుమార్‌రెడ్డి (27), కర్నాటరాష్ట్రం కంప్లికి చెందిన లక్ష్మిదేవి (38), కంప్లికి చెందిన సుభద్ర (38) ఆమె కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డి(11), మైలవరానికి చెందిన సుమలత(38), వాహనం డ్రైవర్ అబకంపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి (38) మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మేఘన, శిల్ప పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో వెంకటలక్ష్మి, లక్ష్మిదేవి, సుభద్ర, సుమలత సొంత అక్కాచెల్లెళ్లు కాగా, సునిల్‌కుమార్‌రెడ్డి, నితిన్ వెంకటలక్ష్మి, సుభద్ర కుమారులు. ఈ ప్రమాదంలో గాయపడిన నారాయణరెడ్డి, జయలక్ష్మి, ఆదిలక్ష్మి, మోక్షిత్‌రెడ్డి, యువన్‌రెడ్డి, మేఘనారెడ్డి, శిల్పారెడ్డిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందడంతో ప్రభుత్వ వైద్యశాల వద్ద కుటుంబ సభ్యులు చేస్తున్న రోదనలు కంటతడి పెట్టించాయి.

అరగంటలో ఇంటికి చేరుతామనే లోపే ...

దైవ దర్శనానంతరం ఎంతో సంతోషంగా మరో అరగంటలోపు ఇంటికి చేరుకుంటామని అనుకునే లోపే వారు అనంతలోకాలకు వెళ్లారు. తాడిపత్రికి చెందిన వెంకటలక్ష్మి భర్త సంవత్సరం క్రితం మృతిచెందాడు. అప్పటినుంచి ఇంటి వద్దనే ఉన్న వెంకటలక్ష్మిని ఆలయాల దర్శనార్థం తీసుకువెళదామని కుటుంబసభ్యులు భావించారు. ఈ నేపథ్యంలో వెంకటలక్ష్మి తన చెల్లెళ్లు అయిన లక్ష్మిదేవి, సుభద్ర, సుమలతను తాడిపత్రికి పిలిపించుకున్నారు. వీరితో పాటు వెంకటలక్ష్మి కుమారుడు సునిల్‌కుమార్‌రెడ్డి, నితిన్‌తో పాటు వారి బంధువులైన మేఘన, శిల్ప, ఆదిలక్ష్మి, నరసింహారెడ్డి, కాటసాని భాస్కర్ రెడ్డి, తదితరులతో పాటు వాహన డ్రైవర్ సుధాకర్‌రెడ్డి మొత్తం 14 మంది తుఫాను వాహనంలో తిరుమలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈ విషాదఘటన చోటు చేసుకుంది.

రోడ్డు ప్రమాదంలో తునాతునకలు అయిన తుఫాను వాహనం, చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

పాదయాత్రలో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామిని నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన లేపాక్షి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి పాత్రికేయులతో మాట్లాడారు. కరోనా వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆపలేదని గుర్తు చేశారు. చెప్పిన ప్రతి ఒక్క పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. సచివాలయాలను నిర్మించిన వారికి కూడా ఈ వారం నుంచి బిల్లులు పడుతున్నాయన్నారు. వీఆర్వోలు, సర్వేయర్లు తహశీల్దార్ కార్యాలయాలకే పరిమితమయ్యారని ఆరోపణలు వచ్చాయని, సచివాలయంలో మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని అన్నారు. సచివాలయ ఉద్యోగులు అలా ఉండకపోతే వారికి నోటీసులు జారీ చేస్తామని, భవిష్యత్తులో మళ్ళీ అదే తప్పు చేస్తే వారిని సస్పెండ్ చేసే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. వారికి ఏదైనా బయట పని ఉంటే ఎంపీడీవో, డీఎల్డీవో అనుమతులు తీసుకొని వెళ్లాలన్నారు. సచివాలయ ఉద్యోగులు జగనన్న ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చే విధంగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా, ప్రజల్లో ఏ విధమైన స్పందన ఉంది అనేది తెలుసుకునేందుకు తాము వచ్చామన్నారు. ప్రజలకు అన్ని రకాల లబ్ధి నేరుగా అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ విజయ్ కుమార్ రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : సచివాలయ ఉద్యోగులు సక్రమంగా పనిచేయకపోతే సహించేది లేదని ప్రభుత్వ సలహాదారుడు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం చిలమత్తూరు మండలంలో పర్యటించారు. సిసి రోడ్లు, సచివాలయ నిర్మాణాలు, జగనన్న కాలనీలను పరిశీలించారు. అదే విధంగా పలు సచివాలయాలను పరిశీలించారు. అనంతరం స్థానిక ఆర్‌బికెలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు తాము చేసిన సచివాలయ నిర్మాణాలు, రోడ్డు పనులకు బిల్లులు అందడం లేదని మొరపెట్టుకున్నారు. బిల్లులు సరైన సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా ఆయన ఎస్ఇకి సూచించారు. సచివాలయ ఉద్యోగులు సక్రమంగా పని చేయడం లేదని ప్రజల నుండి ప్రజాప్రతినిధుల నుండి ఫిర్యాదు వచ్చాయని ఇది మంచిది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, జెడ్పీ సిఇఒ భాస్కర్ రెడ్డి, డిపిఒ విజయ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డ్వామీ పీడీ రామాంజినేయులు, జడ్పీటీసీ అనూషా, వైసిపి మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, ఎంపిటిసి జగన్ మోహన్ రెడ్డి, సర్పంచి సంధ్య, తిరుమలేష్, వైస్ ఎంపిపి బయప్ప, ఎంపిడిఒ రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు 'పోతిరెడ్డి'

మొదటి రోజు ఈఏపీసెట్ ప్రశాంతం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ, ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈఏపీసెట్-23 సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం,సాయంత్రం రెండు పూటలు జరిగిన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 50, 235 మంది హాజరు కావల్సి ఉండగా 3231 మంది గైర్హాజరైనట్లు ఈఏపీసెట్-23 ఛైర్మెన్ ఆచార్య జి. రంగ జనార్ధన, కన్వీనర్ ఆచార్య సి. శోభాబిందు తెలిపారు. సోమవారం ఉదయం మరియు మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో ఆంధ్రప్రదేశ్ లో మొత్తం 48,913 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 46,380 మంది హాజరయ్యారని చెప్పారు. అలాగే తెలంగాణలో 4,322 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 3,624 మంది హాజరయ్యారని చెప్పారు. ఈ పరీక్షలకు 93.93 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఈఏపీసెట్ - 23 ఛైర్మెన్ ఆచార్య జి. రంగ జనార్ధన తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ : సోమవారం ప్రారంభమైన ఈఏపీసెట్ -23 పరీక్షల కేంద్రాలను జేఎన్టీయూ ఉపకులపతి, ఈఏపీసెట్ ఛైర్మెన్ ఆచార్య జి.రంగ జనార్ధన పరిశీలించారు. అనంతపురం లోని అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలను, కడప జిల్లాలోని కె.ఎస్.ఆర్.ఎం ఇంజనీరింగ్, కోరం ఇంజినీరింగ్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పరీక్షలు నిర్వహణలో నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి

ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న

22న కలెక్టరేట్ వద్ద ఉపాధి కూలీల ధర్నా

కొత్తచెరువు: ఈ నెల 22వ తేదీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పుట్టపర్తి కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలో ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న పిలుపునిచ్చారు. మండల పరిధిలోనే ఎర్రపల్లి, బండ్లపల్లి, బైరాపురం, లోచర్ల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించి కూలీలతో చర్చించి వారితో పోస్టర్లను విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చడానికి సిద్ధమయ్యాయని, దీంతో ధర్నాకు పిలుపునిచ్చామని తెలిపారు. కార్యక్రమంలో లింగమయ్య, కృష్ణమూర్తి, శంకర నారాయణరెడ్డి, కార్తీక్, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

17న రెవెన్యూ ఉద్యోగుల సదస్సు

ఎపి జెఎసి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు

పుట్టపర్తి రూరల్: ఈ నెల 17న రెండవ ప్రాంతీయ సదస్సు అనంతపురంలో నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని శ్రీసత్యసాయి జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఆయన సోమవారం శ్రీసత్య సాయి జిల్లా రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోగా వారిపై కక్ష గట్టి ఎసిబి దాడులు చేయిస్తోందన్నారు. అనంతరం పుట్టపర్తి మండల గ్రామ రెవెన్యూ నౌకర్లు ఆయనకు సత్యసాయి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ జెఎసి శ్రీసత్యసాయి జిల్లా నాయకులు మైనుద్దీన్, జనరల్ సెక్రటరీ జివైవి రావు, డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

27న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హిందూపురం: పుట్టపర్తిలోని సాయి ఆరాం ఫంక్షన్ హాలులో ఈ నెల 27న శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న వాల్మీకి, బోయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానోత్సవం చేస్తున్నట్లు జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు విజయ్‌కుమార్, కార్యదర్శి శివయ్య సోమవారం తెలిపారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 450కి పైగా, ప్రయివేటు విద్యార్థులు 475 మార్కులు, ఇంటర్‌లో (ప్రభుత్వ కళాశాల) 800, ప్రయివేటు విద్యార్థులు 850 మార్కులకు పైగా సాధించిన వారు ఈ నెల 23లోగా మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు దరఖాస్తులను జనార్దన్ 94416 65692, రవిశేఖర్ 77805 83140, నరసింహులు 94402 43109, శివన్న 94416 65182 నంబర్లకు వాట్సాప్ చేయాలన్నారు.

ఘనంగా గ్రాస్ రూట్ ఫుట్‌బాల్ డే

లేపాక్షి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం లేపాక్షి మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటి అనంతపురం సహాయ సహకారాలతో ఏఎఫ్‌సి పదవ గ్రాస్ రూట్ డే నిర్వహించారు. ఇందులో లేపాక్షి, పులమతి ఉన్నత పాఠశాలల క్రీడాకారులు 45 మంది పాల్గొన్నారు. వారు ఫుట్‌బాల్‌కి సంబంధించిన రిక్రియేషనల్ గేమ్స్ గంట సేపు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రామాంజనేయులు, సురేష్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు అలీం, శృతి, రూపేష్, వెంకటేష్, సుశీల పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సభ్యత్వ నమోదు

లేపాక్షి: మండలంలోని కల్లూరు, కంచిసముద్రం, బయ్యన్నపల్లి, గ్రామాల్లో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశాలకు వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టారు. అలాగే ఈ నెల 22న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, నాయకులు రాజప్ప, క్రిష్ణమూర్తి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ రైతు భరోసా అర్హుల జాబితా విడుదల

లేపాక్షి: మండలంలోని వైఎస్ఆర్ రైతు భరోసా అర్హుల జాబితాను సోమవారం సంబంధిత రైతు భరోసా కేంద్రత్లో ప్రదర్శించారు. మండల వ్యాప్తంగా 7100 రైతులు లబ్ధిదారుల జాబితాలో నమోదయ్యారు. మిగిలిపోయిన అర్హులైన రైతులు ఉంటే ఈ నెల 18 వ తేదీ లోపు రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఎఒ శ్రీలత తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

పుట్టపర్తి రూరల్: గత మార్చిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ ఆర్.మల్లికార్జున కుటుంబానికి సోమవారం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయం లోని ఎస్పీ కార్యాయంలో కానిస్టేబుల్ భార్య ఆర్. అశ్వినికి విడో ఫండ్ కింద రూ. 50వేలు, ఇన్సిడెంటల్ ఛార్జెస్ కింద రూ. 25వేల చెక్కులను అందజేశారు. ఆ కుటుంబానికి అందాల్సిన ఇతర ఆర్థిక సహాయాన్ని కూడా వీలైనంత త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని, వారి కుటుంబానికి పోలీస్ శాఖ నిరంతరం తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి విజయ్ కుమార్, ఏఓ సుజాత, ఏఆర్ అడ్మిన్ ఆర్ఐ టైటాస్ , సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ ఆర్.మల్లికార్జున కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

చెవిటోనికుంటను సంరక్షించండి

ప్రజాశక్తి-బత్తలపల్లి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్తున్న టిడిపి నేతలు, గామస్తులు

మూగజీవాల దాహార్తి తీర్చడంతో పాటు భూగర్భ జాలల పెంపునకు దోహదపడుతున్న చెవిటోనికుంటను భూ బకాసరుల నుంచి కాపాడాలని టిడిపి నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం బత్తలపల్లి మండల టిడిపి కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, ధర్మవరం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాసులునాయుడు, ఆ గ్రామ రైతులు, పశువులు, గొర్రెల కాపరులతో కలిసి పుట్టపర్తిలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెవిటోని కుంటను యర్రాయపల్లి గ్రామానికి చెందిన శివారెడ్డి అనే వ్యక్తి తన భూమిలో కలుపు కోవడానికి ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. వినతి ఇచ్చిన వారిలో రావి భాస్కర్‌నాయు డు, పొత్తూరి త్రివిక్రమ్, నరిశెట్టి కాటమయ్య, చల్లా హేమంత్, చల్లా నాగముని, ములకల వెంకటనాయుడు, సాపినేని వెంకటేశు, పొత్తూరి తిరుపతయ్య, పోత్తూరు శ్రీరాములు, చాపట్ల శివయ్య, చిలంకూరి వెంకటనారాయణ, చల్లా ప్రకాష్, చల్లా రామానాయుడు, చల్లా నాగరాజు, చిటా రమేష్, చల్ల నాగముణి, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-లేపాక్షి

సిపిఐ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాస్వామ్య విలువలను మంట గలుపుతున్న ప్రభుత్వాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. లేపాక్షిలో ఏర్పాటు చేసిన సిపిఐ శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం ఆయన శిక్షణ తీసుకుంటున్న నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ముసుగులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ధనాన్ని దోచుకుంటున్నా యని, ప్రభుత్వ ఆస్తులను, ప్రజల ఆశయాలను తాకట్టు పెట్టి రాజ్యాధికారం చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం రాజకీయాలు అవినీతి చుట్టూ తిరుగుతున్నా, సిపిఐ ఓటుకు నోటు లేని రాజకీయం చేసిందన్నారు. విద్యావిధానంలో ప్రయివేటు వ్యాపారం తప్ప పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. వ్యవసాయ రంగాన్ని జూదాలుగా మార్చి రైతులను భిక్షగాళ్లను చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండకట్టి ప్రజల్లో మార్పు తేవాల్సిన బాధ్యత ప్రతి సిపిఐ కార్యకర్తపై ఉందన్నారు. జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లాలో నీటి సమస్య తీరాలంటే హంద్రీనీవానే శరణ్యం అన్నారు. జిల్లాలో రైతుల పక్షాన హంద్రీనీవా కాలువలపై నిద్రించి పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం ప్రజానాట్య మండలి విప్లవ గీతాలతో శిక్షణ తరగుతులను ముగించారు. కార్యక్రమంలో లేపాక్షి మండల కార్యదర్శి శివప్ప, పట్టణ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరెడ్డి. గోవిందరెడ్డి, నారాయణరెడ్డి, గౌతమ్ కుమార్, బాలచంద్ర, రాజేంద్ర, వెంకటేశు, కార్యవర్గ సభ్యులు మధు, ఆంజనేయులు, శ్రీరాములు, కదిరప్ప, కుళ్లాయప్ప, రమణ, బాబు, కళాకారులు పినీ కుళ్లాయప్ప, ఆంజనేయులు, పుల్లయ్య, ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'యశోద' విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజయాన్యం

ధర్మవరం టౌన్: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు యశోద పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-16 విభాగంలో మాధవసాయి, నిఖ్యశ్రీ ప్రతిభ కనబరచారన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ తో పాటు ప్రిన్సిపల్ అనూపకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ధర్మవరం టౌన్: జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ధర్మవరం క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆత్మీయ ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. మే 16 నుంచి 19వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జరిగే ఆరో యూత్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి అనంతపురం జట్టు తరపున బాలికలు కిరణ్మయి, సల్మా, నిఖ్యశ్రీ, బాలురు విజయ్, తరుణ్, మాధవసాయి పాల్గొంటారన్నారు. వీరిని అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు అధ్యక్ష, కార్యదర్శులు హిదయతుల్లా, కోచ్ సంజయ్ అభినందించారు.

మాదిగలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలి

పుట్టపర్తి అర్బన్: అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు డిమాండ్ చేశారు. స్థానిక సాయి ఆరామం అతిథి గహంలో సోమవారం ఎంఆర్‌పిఎస్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ సమాజంలో మాదిగలపై వివక్ష కొనసాగుతోందన్నారు. 29 ఏళ్లుగా వర్గీకరణ కోసం పోరాడుతున్నా మాదిగల ఆశయం నెరవేరలేదన్నారు. ఎస్‌సి వర్గీకరణతో పాటు రాజకీయంగా ఎదగడానికి అన్ని పార్టీలు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఓటు బ్యాంకుగా వినియోగించుకునే పార్టీలకు బుద్ధి చెబుతామన్నారు. మాదిగల్లో చైతన్యం కోసం శింగనమల నియోజకవర్గం నుంచి చైతన్య యాత్ర చేపడుతామన్నారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ జిల్లా నూతన అధ్యక్షుడిగా సి.రామాంజనప్పను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆసాది గంగిశెట్టి, రాష్ట్ర కార్యదర్శి జెసి శేఖర్, రాష్ట్ర ఎంఈఎఫ్ అధ్యక్షుడు కుళ్లాయప్ప, రాయలసీమ కార్యదర్శి పెడపల్లి వెంకటేశు, అధికార ప్రతినిధి తిప్పయ్య, మంద నరేష్, మిద్దె అంజి, తదితరులు పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వర్తించాలి : ఎంపీడీవో

అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ పోలప్ప

ఓబులదేవర చెరువు: అంగన్‌వాడీ సెంటర్లను సక్రమంగా నడపాలని, ప్రీ స్కూల్ ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని, మెనూ ప్రకారం ఆహారం వండి పిల్లలు, తల్లులకి పెట్టాలని ఎంపిడిఒ పోలప్ప ఆదేశించారు. మండలం పరిధిలోని వడ్డీవారిపల్లి అంగన్వాడీ సెంటర్‌లో సోమవారం అంగన్వాడీ కార్యకర్తలతో ఎంపిడిఒ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అంగన్వాడీ కార్యకర్తలు సహకరించాలన్నారు. బాలింతలు, గర్భిణులు, అంగన్వాడీ పిల్లలకు వైఎస్ఆర్ కిట్లు, గుడ్లు, పాలను సక్రమంగా అందించాలన్నారు. బియ్యం, దాల్, ఆయిల్, వంటివి డీలర్ల దగ్గర నుంచి సక్రమంగా అందడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి గారి జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సివి మహేష్ కుమార్‌కు డాక్టరేట్

సన్మానం చేస్తున్న న్యాయవాదులు

కదిరి-అర్బన్ : సివి కృష్ణమూర్తి రెండవ కుమారుడు మహేష్‌కుమార్‌కి డాక్టరేట్ వచ్చినందుకు సోమవారం పట్టణంలోని రిషిత చిన్న పిల్లల వైద్యశాలలో సీనియర్ న్యాయవాది సీవీ కష్ణమూర్తి, చిన్న పిల్లల వైద్య నిపుణులు సివి మదన కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వత్తిని దైవంగా భావించి, పది మందికి ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తూ సివి మహేష్ కుమార్ డాక్టరేట్ పొందారన్నారు. మహేష్ కుమార్ 18 సంవత్సరాలుగా సాఫ్ట్వేర్ రంగంలో విధులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రస్తుతం ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్‌లో ప్రోగ్రాం మేనేజర్‌గా పని చేస్తూ, 300 పైన వర్క్ షాప్స్‌లో పాల్గొన్నాడన్నారు. ఆయనకు ఇంటర్నేషనల్ యూనివర్సిటీ పీఏఆర్ఐఎస్ వాళ్ల డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి, జనసేన అధ్యక్షులు భైరవ ప్రసాద్, న్యాయవాదులు శాలిమియా, సురేంద్ర చౌదరి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు వరం, వైసిపి నాయకులు కొమ్ము భాస్కర్, ఎన్జీవో అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

మడకశిర రూరల్: రొళ్ల, బ్యాడిగెర గ్రామానికి చెందిన పలువురు సోమవారం మడకశిర పట్టణంలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి సమక్షంలో పలువురు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి రమేష్‌తో పాటు పార్టీలో చేరిక వారికి శాలువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రొళ్ల మండల అధ్యక్షుడు దాసిరెడ్డి, జిల్లా టిఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు కె.బ్యాడిగెర మూర్తి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, క్లస్టర్ ఇన్‌ఛార్జి భరత్, మీసేవ వెంకటేష్, యూనిట్ కాంతరాజు, అశ్వత్థ, కాలేగౌడ, ముద్దనాయక్, యల్లప్ప, గురుషాంత్, తదితరులు పాల్గొన్నారు.

భూ పరిహారంపై రైతులకు స్పష్టత ఇవ్వాలి

తహశీల్దార్ రంగనాయకులుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

గోరంట్ల: మండలంలో గ్రీన్ ఫీల్డ్ హైవేకు రైతుల నుంచి సేకరించిన భూములకు ఎకరాకు పరిహారం ఎంత ఇస్తారో స్పష్టత ఇవ్వాలని కోరుతూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భూములు కోల్పోతున్న రైతులు తహశీల్దార్ రంగనాయకు లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం గోనివారిపల్లి, పులేరు, వానవోలు, బూదిలి, తదితర గ్రామాల రెవెన్యూ పొలాల్లో అధికారులు భూములు సేకరించారన్నారు. అయితే పండ్ల తోటలకు, బోరు బావులకు ఏ మేరకు నష్టపరిహారం ఇస్తారో తెలియజేయడం లేదన్నారు. ఈ రెవెన్యూ గ్రామాల్లో భూముల విలువ అధికంగా ఉందని, ఓపెన్ మార్కెట్ విలువకు సమానంగా భూ పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సోమశేఖర్, రవితేజ, ఆనంద్‌రెడ్డి, ఈడిగ రవీంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆ విద్యాసంస్థ గుర్తింపు రద్దు చేయాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

టెక్నో, ఈ టెక్నో, సిబిఎస్ఈ, తదితర పేర్లతో నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎంఎస్ఎఫ్, ఆర్ఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్‌జాన్ మాట్లాడుతూ స్థానిక శ్రీచైతన్య పాఠశాల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా కదిరి పట్టణంలోని ఎన్జీవో కాలనీ, సైదాపురం, అడపాల వీధిలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అలాగే ఒక రిజిస్ట్రేషన్‌పై ఎక్కువ బ్రాంచిలు నడుపుతున్నారని ఆరోపించారు. ఇకనైని విద్యాశాఖ అధికారులు స్పందించి శ్రీచైతన్య విద్యాసంస్థ గుర్తింపును రద్దు చేయాలని లేనిపక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు తరుణ్, జనార్ధన్, టిప్పు, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్‌కుమార్, యశ్వంత్, ఎంఎస్ఎఫ్ నాయకులు రాజు, ఆర్ఎస్‌యు నాయకులు చరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన వైసిపి నేత గిరిబాబు, బిసి కాలనీకి చెందిన చౌకధాన్యం డీలర్ శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరు చికిత్స అనంతరం స్వగహంలో విశ్రాంతి తీసుకుంటుండగా సోమవారం ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మండల వైసిపి కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజర్ బోర్డ్ ఛైర్మన్ అవుతాల రమణారెడ్డి, ఎంపిపి గాయత్రి రెడ్డప్పరెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచి రాధా నాగరాజు, వైసీపీ నాయకులు ఉన్నారు.

కొండపైన సౌకర్యాలు కల్పించాలని వినతి

పెనుకొండ: పెనుకొండ కొండపై విద్యుత్, తాగునీరు, రోప్‌వే, రోడ్డు సౌకర్యాలు కల్పించాలని సోమవారం పర్యాటక పోరాట కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది జె.ప్రతాపరెడ్డి ఎమ్మెల్యే శంకర నారాయణని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ కొండపైకి 1వ కి.మీ నుంచి 2వ కి.మీ వరకూ రోడ్డు, బేస్ క్యాంపు నుంచి ఎన్‌హెచ్-44 వరకూ తిరువెంగలరాయలు చెరువు కట్ట మీదుగా బైపాస్ రోడ్డు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు, బేస్ క్యాంపు నుంచి దేవాలయం వరకు రోప్ వే ఏర్పాటుకు అంచనాలు తయారు చేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా బేస్ క్యాంపు స్థలం నుంచి డంప్ యార్డ్‌ను తొలించాలని విజ్ఞప్తి చేశారు. బేస్ క్యాంపు స్థలాన్ని ఇస్కాన్ సంస్థకు లీజుకు కాకుండా, విక్రయ పత్రం ద్వారా స్వాధీనం చేయాలని కోరారు.

వైసీపీని గద్దె దించడమే జనసేన లక్ష్యం : చిలకం

విలేకరులతో మాట్లాడుతున్న చిలకం

ధర్మవరం టౌన్: నాలుగేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అతలాకుతలం అయిందని, దీంతో రాష్ట్రాన్ని కాపాడేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం పట్టణం లోని తన స్వగహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి పవన్ కల్యాణ్ పై విమర్శలు చేసే ముందు గ్రామాల్లో వారి ఎమ్మెల్యేలపై ప్రజల తిరుగుబాటు, చెప్పులు విసరడంపై సమాధానం చెప్పాలని కోరారు. పవన్‌పై అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తున్న మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్‌లకు జనసేన కార్యకర్తలు దేహశుద్ధిచేసే పరిస్థితి త్వరలోనే వస్తుందన్నారు. పెరిగిన ధరలతో ధర్మవరంలో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో వైసీపీని గద్దెదించడానికి కలిసి వచ్చే పార్టీలతో కలిసి నడుస్తామన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసిపిని ఇంటికి పంపడమే తమ లక్ష్యమన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తిపై హత్యాయత్నం

చిలమత్తూరు: లాలేపల్లి గ్రామంలో ఐకేపీలో పనిచేస్తున్న నరసింహారెడ్డిపై గుర్తు తెలియని దుండగులు హత్యాయత్నానికి పాల్పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. ఆదివారం సాయంత్రం కర్నాటకలోని బాగేపల్లి నుంచి లాలేపల్లికి వస్తున్న నరసింహారెడ్డిపై లాలేపల్లి క్రాస్ సమీపంలో గుర్తు తెలియని దుండగులు కళ్లలోకి కారం కొట్టి మారణాయుధాలతో మొహం, తలపై దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని బెంగుళూరు ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు రెండు కళ్ళు పూర్తిగా దెబ్బతిన్నట్లు చెప్పినట్లు సమాచారం. పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

దొంగలు అరెస్టు

సోమందేపల్లి: మండల పరిధిలోని రంగేపల్లి సమీపంలో ఉన్న ఇటుకల ఫ్యాక్టరీలో గత గురువారం రాత్రి దొంగతనానికి పాల్పడిన హరిజన రాజు, బోయ మారుతి, షేక్ హుస్సేన్, వడ్డే హరీష్, బండి వేణులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. బాధితుడు నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామన్నారు. ఐదుగురు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి 72 ఐరన్ ట్రాలీ బేరింగ్ షీట్లు, ఒక లగేజీ ఆటోను స్వాధీనం చేసుకొన్నామన్నారు. అలాగే వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకుడికి తీవ్రగాయాలు

రొద్దం: రోడ్డు ప్రమాదంలో టిఎన్ఎస్ఎఫ్ పెనుగొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సాయి కిరణ్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా పరిగి మండలంలో మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారధి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో సాయికిరణ్ పాల్గొన్నాడు. పాదయాత్ర ముగించుకుని స్వగ్రామమైన మండల పరిధిలోని తాడంగిపల్లి గ్రామానికి తిరిగి వస్తుండగా చిన్నమంతుడు ఎస్సీ కాలనీ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని ఆర్.మరువపల్లిలో ఉన్న ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆలయాన్ని సందర్శించిన జడ్‌పి ఛైర్‌పర్సన్

లేపాక్షి: స్థానిక దుర్గా వీరభద్ర పాపానేశ్వర నంది ఆలయాన్ని సోమవారం ఉమ్మడి జిల్లా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి సందర్శించారు. వారికి అర్చకులు ఆలయ విశిష్టతను తెలియజేసి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆ తరువాత స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎలాంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం అందించే పథకాలను సచివాలయాల ద్వారా క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహనాయుడు, ఈఓఆర్‌డి శివన్న, పంచాయతీ కార్యదర్శులు నాగేంద్ర, రమేష్‌బాబు, దుర్గయ్య, రామాంజనేయులు, మండల ఇంజినీర్ హనుమేనాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

గాండ్లపెంట: మండల పరిధిలోని గొడ్డివెలగల గ్రామ సచివాలయాన్ని సోమవారం ఎంపిడిఒ డి.అంజనప్ప, ఎంపిపి తాతం జగన్మోహన్ పరిశీలించి సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వైఎస్ఆర్ బీమా రెన్యువల్, జెవిడి ఈకేవైసీ, తదితర వాటిపై సమీక్ష నిర్వహించి సచివాలయం సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి బాషా, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

కదిరి టౌన్: తనకల్లు మండలంలోని మంగళదిన్నేపల్లి గ్రామంలో అక్కదేవతల దేవాలయానికి వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ సోమవారం రూ. 25వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ బత్తల వెంకట రమణ, పట్టణ అధ్యక్షులు బాహుద్దీన్, రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లోకేశ్వర్‌రెడ్డి, చంద్ర, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనం చెల్లించాలి

సోమందేపల్లి: ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పిస్తూ, రోజు కూలి రూ. 600 వచ్చేలా పనికి తగ్గ వేతనం చెల్లించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చాకర్లపల్లి, పందిపర్తి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలపై ఈ నెల 22వ తేదీన కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాలో కూలీలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సంబంధిత డిమాండ్స్‌తో ఉన్న కరపత్రాలను కూలీలకు అందజేశారు.

60 మందికి కంటి పరీక్షలు

సోమందేపల్లి: స్థానిక ఒకటో సచివాలయ పరిధిలో సోమవారం డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు మూడో విడత కార్యక్రమాన్ని వైద్యులు వైవిఆర్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి నలుగురిని ఆపరేషన్, మిగిలిన వారిని కళ్లజోడు అవసరమని వైద్యులు తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని మండలంలోని అన్ని సచివాలయాల్లో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, పర్యవేక్షకులు రవీంద్ర, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పేదలకు టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలి

కదిరి అర్బన్: పేదల కోసం నిర్మించిన డిట్కో ఇళ్లను పూర్తి చేసి అర్హులకు పంపిణీ చేయాలని జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమం కోసం కష్టపడి పనిచేస్తున్నానని చెప్పుకుంటున్న సిఎం జగన్ నాలుగేళ్లలో నాలుగు ఇళ్లనైనా పేదలకు అందించారా అని ప్రశ్నించారు. ఇకనైనా అబద్ధాలు చెప్పడం మాని, అధికార దాహం విడిచిపెట్టి టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలని కోరారు.

వైసిపి పాలనకు చరమగీతం పాడండి : పల్లె

యువగళం సంఘీభావ పాదయాత్రలో మాట్లాడుతున్న పార్థసారధి, సవితమ్మ

కొత్తచెరువు: వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. నారా లోకేష్ 'యువగళం' పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు సంఘీభావంగా సోమవారం పల్లె పుట్టపర్తి నియోజకవర్గంలో పుట్టపర్తి నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి కర్నాటక నాగేపల్లి, జానకంపల్లి, బుక్కపట్నం మీదుగా కొత్తచెరువుకు చేరుకున్నారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో పల్లె మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు. జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్లు రామకష్ణ, టౌన్ కన్వీనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న వైసిపి రాబోయే రోజుల్లో బంగాళా ఖాతంలో కలిసిపోవడం ఖాయమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా కందికుంట సోమవారం కదిరి మున్సిపాలిటీలో టిడిపి శ్రేణులతో కలిసి 7 కి.మీ పాదయాత్ర చేపట్టారు. తొలుత ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాదయాత్ర ఎంజీ రోడ్డు నుంచి కాలేజి సర్కిల్ వరకూ కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ చరిత్రలో లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర చరిత్ర సష్టించబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు బాబ్‌జా న్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్ బాబు, మనోహర్ నాయుడు, ఇర్ఫాన్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప పేర్కొన్నారు. లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా సోమవారం టిడిపి నాయకులు పాదయాత్ర చేపట్టారు. తొలుత పట్టణంలోని సత్యమ్మ, హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించగా కర్నాటక నాగేపల్లి, బుక్కపట్నం మీదుగా కొత్తచెరువుకు చేరింది. అక్కడ బహిరంగ సభలో పల్లె మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఎండను కూడా లెక్క చేయక లోకేష్ 4 వేల కి.మీ పాదయాత్ర చేయడం గొప్ప విషయమన్నారు. నిమ్మల మాట్లాడుతూ ఎన్‌టిఆర్ మనవడిగా లోకేష్ మరో చరిత్ర సష్టిస్తారన్నారు.

పరిగి: లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా చేపట్టిన పాదయాత్ర మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మల ఆధ్వర్యంలో పరిగి నుంచి పైడేటి వరకు సుమారు 8 కి.మీ మేర సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ దుర్మార్గపు పాలన పోవాల న్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పాదయాత్రలో నాయకులు లక్ష్మారెడ్డి, ఈశ్వరప్ప, చౌడప్ప, శేఖర్, నాగభూషణ, డిఎస్ఎల్ శ్రీనివాసులు, రొద్దం నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: నారా లోకేష్ యువగళం పాదయాత్ర సమకాలీన రాజకీయాల్లో సరికొత్త ప్రభంజనాన్ని సష్టిస్తోందని టిడిపి నియోజకవర్గ సమన్వయ కర్త శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి అంబికా లక్ష్మినారాయణ పేర్కొన్నారు. లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా సోమవారం కిరికెర పంచాయతీ బసవనపల్లి శివాలయం నుంచి పాదయాత్రగా బెంగళూరు రోడ్డు నుంచి ఆర్ అండ్ బి బంగ్లా వరకు సాగింది. వారు మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలను సాక్ష్యాధారాలతో బయట పెడుతుండటంతో వైసీపీ నాయకులకు నిద్రపట్టడం లేదన్నారు. కార్యక్రమంలో అంజినప్ప, అమర్నాథ్, అనిల్‌కుమార్, పాల్గొన్నారు.